క్లుప్తంగా

సూర్యగిరి ఎల్లమ్మకు పూజలు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు బారుల తీరారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది కాశీనాథ్, మురళీ, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు



మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

మీర్‌పేట: పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అందరూ కలసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ సూచించినట్లు తీగల కృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, మాజీ ఎంపీటీసీ రవిగౌడ్, సిద్దాల బాలప్ప, కో–ఆప్షన్ సభ్యులు పల్లె జంగయ్యగౌడ్, నాగేందర్‌గౌడ్, పెండ్యాల సత్యనారాయణ, రామిడి బుచ్చిరెడ్డి ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



శ్రీరాం కాలనీ బస్టాప్‌లో ఓపెన్‌గా ఉన్న మ్యాన్‌హోల్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీ ప్రధాన బస్టాప్ వద్ద నడిరోడ్డుపై మ్యాన్‌హోల్‌కు పైకప్పు లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు భయపడుతున్నారు. రాత్రి వేళల్లో అక్కడ మ్యాన్‌హోల్ ఉన్న విషయం కూడా తెలుసుకోలేక ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాద తీవ్రతను గుర్తించిన స్థానిక యువకులు మ్యాన్‌హోల్ వద్ద హెచ్చరికగా కర్రను ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి వెంటనే మ్యాన్‌హోల్ పైకప్పును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

హాలు నిర్మాణానికి నిధులు మంజూరు

ఆమనగల్లు: కమ్యూనిటీహాలు నిర్మాణానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిధులు మంజూరు చేయించారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని నవచైతన్య కాలనీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కమ్యూనిటీహాలుకు మంజూరైన రూ.10లక్షల ఉత్తర్వులను వస్పుల జంగయ్య నవచైతన్య కాలనీవాసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జంతుక జానయ్య, పులికంటి మైసయ్య పాల్గొన్నారు.

నేడు చల్లంపల్లిలో ఆయిల్‌పామ్ ప్లాంటేషన్

కడ్తాల్: మండల పరిధిలోని చల్లంపల్లిలో బుధవారం ఉదయం 11 గంటలకు ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల ఉద్యాన శాఖ అధికారి సౌమ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

తలకొండపల్లి: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని దేవుని పడకల్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్, డాక్టర్ అఖిల్, డాక్టర్ అనిల్, హైదరాబాద్ కామినేని హాస్పిటల్, ఆమనగల్లు లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 207 మంది రోగులకు వివిధ రకాల వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు.



బడంగ్‌పేట్: మెడికల్ క్యాంప్‌లో పాల్గొన్న కార్పొరేటర్, వైద్యులు



కందుకూరు పీహెచ్‌సీలో పంచాయతీ సిబ్బందికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

పహాడీషరీఫ్: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దరిచేరవని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి పేర్కొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీశైలం ప్రధాన రహదారి, అర్బన్ ఫారెస్ట్ పార్కు వద్ద మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి పర్యవేక్షణలో శంషాబాద్ విమానాశ్రయం హెల్త్ ఆర్గనైజేషన్ డాక్టర్లు శివతేజ, పావనీ వారి సిబ్బంది ప్రధాన రహదారి, పార్కు పరిసరాలను శుభ్ర పరిచి బ్లీచింగ్ పౌడర్ చల్లి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. ఎంతో చక్కగా తీర్చిదిద్దిన అర్బన్ ఫారెస్ట్ పార్కు పరిసరాలలో కొందరు అవగాహన లేమితో చెత్తా చెదారాలు, జంతు వ్యర్థాలను పడేస్తున్నారన్నారు. ఈ కారణంగా పార్కుకు వచ్చేవారు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారన్నారు. పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని విష జ్వరాల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. మున్సిపాలిటీ తరపున అన్ని బస్తీలలో ఎప్పటికప్పుడూ పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ పర్యావరణ అధికారి, జవాన్లు హరినాథ్‌గౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పహాడీషరీఫ్: జల్‌పల్లి కమాన్ వద్ద స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ వాణిరెడ్డి

మెడికల్ క్యాంప్ నిర్వహణ

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లోని సాయినగర్ కమ్యూనిటీ సెంటర్‌లో మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ రఘు, స్థానిక కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాతావరణంలో తేడాలు వచ్చి చిన్నాపెద్ద లేకుండా అందరూ సీజనల్ వ్యాధులకు గురవుతున్నారన్నారు. అందుకు స్థానిక వైద్యులతో కాలనీల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వ్యాధుల నివారణకు ప్రతి డివిజన్‌లలో ఫాగింగ్‌తో పాటు నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లి చెత్త లేకుండా సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మన ఆరోగ్యాలను మనమే కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, వైద్యులు స్నేత్, గాయత్రి, ప్రవీణ్, కమల, రాజేందర్, జవాన్లు, జగదీశ్, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

స్వచ్ఛత పాటించాలి

కందుకూరు: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీల్లో పంచాయతీ సిబ్బందికి వైద్యారోగ్య శాఖ అధికారులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, డెంగీ, టైఫాయిడ్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగు జాగ్రత్తలు తెలిపారు.

కేజీబీవీలో..

కొత్తగూడ పరిధిలోని కేజీబీవీలో విద్యార్థినులకు స్వచ్ఛతపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరిత, ఎంపీఓ గీత, ఏపీఓ రవీందర్‌రెడ్డి, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి భార్గవి, పంచాయతీ కార్యదర్శులు సురేందర్‌గౌడ్, ఉమాదేవి, టీఏలు, ఈసీలు పాల్గొన్నారు.



జల్‌పల్లి కార్గో రోడ్డులో పారుతున్న చెరువు మిగులు నీరు

కార్గో రోడ్డుపై పారుతున్న చెరువునీరు

పహాడీషరీఫ్: కురుస్తున్న వర్షాలతో జల్‌పల్లి పెద్దచెరువు మరోసారి పొంగి పొర్లుతోంది. 150 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువు మైసమ్మ ఆలయ సమీపంలో ఉన్న అలుగు నుంచి భారీగా కిందికి పారుతుండగా.. ఇటు కార్గో రోడ్డు వైపు కూడా మిగులు జలాలు ప్రధాన రోడ్డుపైకి వస్తున్నాయి. ఇంకా వర్షాలు కురుస్తుండడం మామిడిపల్లి గుట్టలు, విమానాశ్రయం వైపు నుంచి వరద చెరువులోకి వస్తుండడంతో మిగులు జలాలు ముత్యాలమ్మ ఆలయ సమీపం నుంచి బయటికి వస్తూ కార్గో రోడ్డంతా పరుచుకొని పారుతున్నాయి. ఏకంగా రోడ్డులో సగభాగం మేర పారుతూ వాంబే కాలనీ, లక్ష్మీగూడ ప్రభుత్వ పాఠశాల వరకు వస్తున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యేలా వరద కొనసాగుతోంది. 2021లో భారీ వర్షాలకు ఈ విధంగానే నీరు పారడంతో రహదారి పాడైంది. అనంతరం హెచ్ఎండీఏ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఇప్పుడు కూడా మరో రెండు మూడురోజుల పాటు ఇదే తరహాలో పారితే రెండు కిలోమీటర్ల మేర రోడ్డు గోతులమయంగా మారేలా ఉంది. మిగులు నీరు రోడ్డుపైకి చేరకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం 51వ మహాజన సభ మంగళవారం స్థానిక రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో సంఘం చైర్మన్, డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుర్కయంజాల్ రైతు సహకార సంఘం లాభాల బాటలో పయనిస్తూ, రాష్ట్రంలోని మిగతా సంఘాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంఘం రూ. 4.20 కోట్ల లాభం గడించిందని, 3,672 మంది రైతులకు డివిడెండ్ కింద రూ. 21,62,578 చెల్లించినట్లు చైర్మన్ సత్తయ్య పేర్కొన్నారు. అనంతరం 325 మంది రైతులకు సబ్సిడీతో మందులను పిచికారి చేసే యంత్రాలు, టార్పలిన్ కవర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, మాజీ జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు, సంఘం డైరెక్టర్ వంగేటి లక్ష్మారెడ్డి, సీఈఓ వై రాందాసు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

కడ్తాల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పోచమ్మ తల్లి ఆలయ చైర్మన్ సత్యంయాదవ్ పేర్కొన్నారు. ఇటీవల మండల కేంద్రంలో బోనాల ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని పోచమ్మ తల్లి ఆలయంలో మంగళవారం చైర్మన్ సత్యంయాదవ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్థానిక నాయకులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అభిషేకంతో పాటు, మారు నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, లక్ష్మినర్సింహరెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, భాస్కర్‌రెడ్డి, రాంచందర్‌నాయక్, రాములు, శ్రీశైలం, మల్లేశ్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్‌గుప్తా, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

షాద్‌నగర్: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ సర్పంచ్ సుమన అన్నారు. మండల పరిధిలోని విశ్వాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతేడాది పదోతరగతి పరీక్షా ఫలితాల్లో తెలుగు, హిందీ సబ్జెక్టుల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినందుకుగాను ఉపాధ్యాయులను ప్రగతి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బూర్గుల గ్రామంలో ఉన్న ప్రగతి వెల్ఫేర్ సొసైటీలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ సర్పంచ్ సుమన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఆవుల రవి, తెలుగు, హిందీ ఉపాధ్యాయులు మల్లేశ్, రవికాంత్‌ను సొసైటీ సభ్యులు ఘనంగా సన్మానించడంతో పాటుగా మెమెంటోలను అందజేశారు. వచ్చే పదో తరగతి వార్షిక ఫలితాల్లో పది జీపీఏ సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు వేల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు హెచ్ఎం తెలిపారు.

హెచ్‌సీయూకు విద్యార్థిని ఎంపిక

కేశంపేట: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ ఎలిజిబులిటీ పరీక్షలో మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన మాధవపురం నందిని అర్హత సాధించింది. ఆమె పదోతరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్మీడియట్ కొత్తపేటలోని ప్రభుత్వ కాలేజీలో చదివినట్లు గ్రామస్తులు తెలిపారు. హెచ్‌సీయూకి ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయులు, కాలేజీ అధ్యాపకులు, గ్రామస్తులు ఆమెను అభినందించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

చేవెళ్ల: ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని షీటీమ్ సభ్యులు రవీందర్, రేష్మ, మల్లేశ్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్ బాలికల పాఠశాలలో మంగళవారం షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు షీటీమ్, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీమ్ సభ్యులు మాట్లాడుతూ.. విద్యార్థులు గుర్తు తెలియని వ్యక్తులు మీ పట్ల ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే వెంటనే 100 డయల్‌కు ఫోన్ చేయాలని సూచించారు. సైబర్ నేరాల గురించి 1930కి, బాల్య వివాహాలు, చిన్న పిల్లలకు ఎదైనా ఇబ్బంది చైల్డ్‌లైన్ హెల్ప్ లైన్ నెం.1098కి ఈవ్‌టీజింగ్‌కి లేదా సైబరాబాద్ వాట్సాప్ నంబర్ 8712663061కి సమాచారం అందించాలని సూచించారు. సోషల్ మీడియా, ఓటీపీ ఫ్రాడ్స్, ఆన్‌లైన్ గేమ్స్‌పై జాగ్రత్తలు వహించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉస్నీసా, ఉపాధ్యాయులు, షీటీమ్ సిబ్బంది ఉన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ



పోషకాహారంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ శాంతిశ్రీ

మహేశ్వరం: బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించడం శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్‌లో భాగంగా పోషకాహారం, పరిశుభ్రత గురించి గర్భిణులు, బాలింతలు, తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమన్నారు. పుట్టిన వెంటనే తల్లి బిడ్డకు పాలు పట్టిస్తే పిల్లలకు వ్యాధినిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. బిడ్డకు ఆరునెలల వరకు తల్లిపాలు తప్పనిసరిగా తాగించాలన్నారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను ఎప్పటికప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు తల్లి పాల ప్రాముఖ్యత, పరిశుభ్రం గురించి అవగాహన కల్పించారు. అనంతరం పోషకాహారంపై బాలింతలు, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయించారు. క్యాక్రమంలో ఎంపీడీఓ శైలజ, దుబ్బచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మల్లికార్జున్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న రహదారి

మీర్‌పేట: చినుకు పడితే దారంతా వరదనీరే. ఇక భారీ వర్షం పడిందంటే అంతే.. చెరువును తలపిస్తోంది మీర్‌పేట కార్పొరేషన్ చౌరస్తాకు సమీపంలోని ప్రధాన రహదారి. ఇక్కడ రహదారి ఇరుకుగా ఉండటంతో పాటు రోడ్డుకు ఆనుకుని వైన్‌షాప్ ఉండడంతో రద్దీ వేళల్లో, వర్షాలు పడినప్పుడు వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. రహదారిపై పెద్దఎత్తున వరదనీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా రోడ్డుకిరువైపులా వాణిజ్య సముదాయాలు రోడ్డును ఆక్రమించడం, దీనికి తోడు గతంలో రోడ్డు విస్తరణ చేపట్టే సమయంలోనూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో తరచూ సమస్య తలెత్తుతోందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఓ వైపు రోడ్డును ఆక్రమించిన నిర్మాణాలు, మరో వైపు వైన్‌షాప్‌కు వచ్చే వాహనాలు రోడ్డుపైనే పార్కు చేయడంతో అవస్థలు పడుతున్నామని, సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన రహదారిపై సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మీర్‌పేట ప్రధాన రహదారిపై నిలిచిన వరదనీరు

లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయం



వీల్స్ ఆన్ మీల్స్ అన్నదానం ప్రారంభించిన సీఐ శివప్రసాద్, తహసీల్దార్ షేక్ ముంతాజ్ తదితరులు

సీఐ శివప్రసాద్

కడ్తాల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని సీఐ శివప్రసాద్ పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్ తండ్రి సీత్యానాయక్ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన 'వీల్స్ ఆన్ మీల్స్' అన్నదాన శిబిరాన్ని మంగళవారం తహసీల్దార్ షేక్ ముంతాజ్‌తో కలిసి సీఐ శివప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు అందజేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. ప్రయాణికులకు ఉచితంగా ఆహారం అందించడం అభినందనీయమని క్లబ్ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఎస్ఐ వరప్రసాద్, క్లబ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, లక్ష్మినర్సింహరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాంచందర్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, లయన్స్‌క్లబ్ సభ్యులు రాజేందర్ యాదవ్, గంప శ్రీనివాస్, అంజయ్యగుప్తా, మహేశ్, నర్సింహ, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, శంకర్, జగన్, చంద్రు, బలరాం, రంగా, పీఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్‌ను పొడిగించండి

ఎంపీ డీకే అరుణకు నేతల వినతి

షాద్‌నగర్: ఎంఎస్‌టీఎస్ రైలును శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వరకు పొడిగించాలని కోరుతూ పలువురు బీజేపీ నేతలు ఎంపీ డీకే అరుణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం షాద్‌నగర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు మహబూబ్‌నగర్‌లోని ఎంపీ నివాసానికి వెళ్లి ఆమెకు వినతిపత్రం అందజేశారు. షాద్‌నగర్ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని, శంషాబాద్ వరకు నడిపిస్తున్న ఎంఎంటీఎస్ రైలును షాద్‌నగర్‌కు వరకు నడిపిస్తే విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధానికి నిత్యం వేల మంది షాద్‌నగర్ నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారన్నారు. అదేవిధంగా హంద్రీ ఎక్స్‌ప్రెస్ రైలును మలక్‌పేటలో ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన డీకే అరుణ రైల్వే శాఖ మంత్రి, అధికారుల దృష్టికి త్వరలో తీసుకెళ్లి ప్రయాణికులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, సుధాకర్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

హామీలను అమలు చేయాలి



మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించిన ఆర్ కృష్ణయ్య, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య
- మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

ఆమనగల్లు: ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో ఈ నెల 28న బీసీ మహాసభ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో బీసీ మహాధర్నా పోస్టర్లను బీసీసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీసీ నాయకులు దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్, తుల ఉమ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. కల్వకుర్తిలో నిర్వహించనున్న మహాధర్నా తెలంగాణ రాష్ట్రంలో చేపట్టనున్న బీసీ ఉద్యమానికి దిక్సూచిగా నిలవాలన్నారు. కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.